

**విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి**

- ఎస్. యం. ఏల్. పనితీరు పై సంతృప్తి.

- ఎం. ఈ. ఓ.. సురేష్. బి

2




# సంగారెడ్డి మెదక్

బుధవారం 09 సెప్టెంబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:12




# మహిళా ఎమ్మెల్యేలపై దౌర్జన్యాలకు నిరసనగా

# జోగిపేటలో బీఆర్ఎస్ మహిళల నిరసన గళం

**- జోగిపేటలో బీఆర్ఎస్ మహిళల భారీ ర్యాలీ..**

**- అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం**



**అందోల్, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి):**

మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసుల వ్యవహారశైలిని నిరసిస్తూ జోగిపేట పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ నేతృత్వంలో బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు.

మిగతా 2 లో

# క్యాడెట్లకు ఎన్‌సీసీతో నాయకత్వ నైపుణ్యాలు




**-గీతం ఎన్‌సీసీ యూనిట్‌ను సందర్శించిన నిజామాబాద్ గ్రూప్ కమాండర్.**

**-శిబిరాల్లో చురుగ్గా పాల్గొనాలని కల్నల్ పి.ఎస్.సింగ్ సూచన**

**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)**

ఎన్‌సీసీ శిబిరాల్లో చురుగ్గా పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలతోపాటు వ్యక్తిగత నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని నిజామాబాద్ గ్రూప్ ఎన్‌సీసీ కమాండర్ కల్నల్ పి.ఎస్.సింగ్ అన్నారు. మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ క్యాంపస్‌లోని ఎన్‌సీసీ యూనిట్‌ను ఆయన సందర్శించారు.

మిగతా 2 లో

# మహిళా ఎమ్మెల్యేలపై దౌర్జన్యాలకు నిరసనగా జోగిపేటలో బీఆర్ఎస్ మహిళల నిరసన గళం

మొదటిపేజీ తరువాయి



అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా క్రాంతి కిరణ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్రంగా అభ్యంతరకరమన్నారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలను మహిళా ఎమ్మెల్యేలనే గౌరవం కూడా లేకుండా పురుష పోలీసులు మెడ పట్టుకుని లాక్కెళ్లడం దారుణమని విమర్శించారు. ప్రజల కోసం ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులపై ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు.మహిళలకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వమే మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులతో దౌర్జన్యం చేయించడం సరికాదని ఆయన ఆరోపించారు. ఈ ఘటనపై మహిళా లోకం తీవ్రంగా స్పందిస్తోందని, బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలకు రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, ప్రజలు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం నిరసన ర్యాలీ అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద మహిళా నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. మహిళా ప్రజాప్రతినిధులపై జరిగిన ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పి.జైపాల్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్లు పి.నారాయణ ముదిరాజ్, డి.బి.నాగభూషణం, బీఆర్ఎస్ నాయకులు పట్లూరి శివశేఖర్, చాపల వెంకటేశం, సార శ్రీధర్, బి.వీరప్ప, శివకుమార్, మాచర్ల విజయ్‌కుమార్, రవి, సుంకె రమేష్, శేషుకుమార్, బిర్ల శంకర్, పల్లె వెంకటరమణ, కరుణాకర్, పరిపూర్ణం, సంతోష్, మొగులయ్య, సటికె రాజు తదితరులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో మహిళా కార్యకర్తలు హాజరై తమ నిరసనను తెలిపారు.

# క్యాడెట్లకు ఎన్‌సీసీతో నాయకత్వ నైపుణ్యాలు

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా గీతం ఎన్‌సీసీ క్యాడెట్లతో కల్నల్ పి.ఎస్.సింగ్ ముచ్చటించారు. వివిధ ఎన్‌సీసీ శిబిరాలు, శిక్షణ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. శిబిరాలు విద్యార్థులకు తమ ప్రతిభను ప్రదర్శించడంతోపాటు నాయకత్వ సామర్థ్యాలను పెంపొందించుకునేందుకు విలువైన అవకాశాలను అందిస్తాయని తెలిపారు.విద్యార్థులు ఎన్‌సీసీ ద్వారా క్రమశిక్షణ, బృందస్ఫూర్తి, బాధ్యతాయుతమైన నాయకత్వం వంటి లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. క్యాడెట్లు తమకు లభించే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈ పర్యటనలో సంగారెడ్డిలోని 33(టీ) బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రమేష్ సరియల్ పాల్గొన్నారు. విద్యార్థి ఎన్‌సీసీ అండర్ ఆఫీసర్ల సహకారంతో గీతం అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ ఎస్.అజయ్‌కుమార్ పర్యటనను సమన్వయం చేశారు.



# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

మొదటిపేజీ తరువాయి



**కల్హేర్, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి):**

కల్హేర్ మండలం కృష్ణాపూర్ ప్రాథమిక పాఠశాలను ఎం. ఈ. ఓ బి సురేష్.ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, పాఠశాల పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న వివిధ రికార్డులను పరిశీలించడంతో పాటు అమలవుతున్న ఎస్ఎంఎల్ కార్యక్రమం తీరును పరిశీలించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు బాధ్యతతో పనిచేయాలని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎం. ఇ. ఓ.బి. సురేష్ సూచించారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు అందించారు.

# రామాయంపేట సీహెచ్‌సీలో ఆరోగ్య సేవలపై డీసీహెచ్ఎస్ పరిశీలన

మెదక్ (ప్రజా జ్యోతి)

మెదక్ జిల్లాలో ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పనిచేస్తోందని డీసీహెచ్ఎస్ డాక్టర్ శివ







దయాల్ తెలిపారు.మంగళవారం రామాయంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను డీసీహెచ్ఎస్ డాక్టర్ శివ దయాల్ సందర్శించి, ప్రజలకు అందుతున్న వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవలు, రోగుల పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వివిధ విభాగాల వైద్య నిపుణుల సేవలను కూడా పరిశీలించారు.ఈ సందర్భంగా డాక్టర్ శివ దయాల్ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పనిచేస్తోందన్నారు. డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ గణేశ్వర్ జిల్లాలోని ఆరోగ్య కేంద్రాలను నిరంతరం సందర్శిస్తూ రోగులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరును పరిశీలించి అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నారని తెలిపారు.నూతనంగా బాధ్యతలు చేపట్టిన వైద్య నిపుణులు వృత్తిపట్ల క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. వివిధ వ్యాధులకు సంబంధించిన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఏ ప్రాంతంలోనైనా ప్రజలు తీవ్రమైన జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు వ్యాధి తీవ్రతకు అనుగుణంగా చికిత్స అందించాలని డీసీహెచ్ఎస్ సూచించారు.ఈ కార్యక్రమంలో రామాయంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు, వైద్య సిబ్బంది, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యాస రచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మెదక్ (ప్రజాజ్యోతి)

పాపన్నపేట మండలంలో ఇటీవల నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు.పాఠశాల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో నేహా (యూసుఫ్‌పేట), వైష్ణవి (పాపన్నపేట), సహస్ర (అన్నారం) గ్రామాలకు చెందిన పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. అలాగే కళాశాల విభాగంలో నిర్వహించిన పోటీల్లో ఆలేఖ్య ప్రథమ స్థానంలో నిలవగా, వైష్ణవి ద్వితీయ స్థానాన్ని, శిరీష తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు.విజేతగా నిలిచిన విద్యార్థులకు నిర్వాహకులు మెమెంటోలు, ప్రశంసా పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలను నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మంజీర విద్యా కళా వేదిక ప్రతినిధులు నవీన్ కుమార్, సురేష్, శివ, కుర్తివాడ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రావుతో పాటు ఉపాధ్యాయులు నాగరాజు, బాలరాజు, పంతుల రాజు, భూషణం, రాజశేఖర్, ఎల్లం, రమేష్, సురేష్, సాయి సిరి, విశ్వనాథ్, యాదయ్య, అనిల్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేల పై దాడిని ఖండిస్తున్నాం..

### - మహిళ ఎమ్మెల్యేలపై దాడి అవమానం

### - రాష్ట్రంలో దురదృష్టం పాలన

మెదక్ (ప్రజా జ్యోతి)



పెద్ద శంకరంపేట్ మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ నివాసంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అసెంబ్లీ గేటు వద్ద జరిగిన సంఘటనకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బెశరత్తుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు మహిళల ఎమ్మెల్యేలపై పోలీసుల దాడి చేయడం అవమానం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో దురదృష్టం పాలన కొనసాగుతుందని ఒకవైపు తెలంగాణ రాష్ట్రాన్ని అమ్మేసే పాలన కొనసాగుతుందని విమర్శించారు ప్రజల సమస్యల గురించి ప్రజా ప్రతినిధులు అడిగితే ప్రభుత్వం దాడులు చేస్తుందని పేర్కొన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన లో ప్రజలకు ఇచ్చిన ఎన్నికల సమయంలో హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలం అయిందని 420 హామీల్లో రెండు మూడు తప్ప హామీల్లో కూడా విఫలం కేసీఆర్ ప్రభుత్వం హాయంలో అన్ని వర్గాలకు పింఛన్ మహిళలకు రుణాలు రైతులకు రైతుబంధు ఉచిత కరెంటు రైతు భరోసా అందించి ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాల అమలు చేసి వారి అభివృద్ధి కోసం కృషి చేయడం జరిగిందన్నారు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో విద్యార్థులు ఉద్యోగులు రాహుదారులపై వచ్చి ధర్నాలు చేసే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో రైతులకు ఎరువులు కొరత కరెంటు కోతలు ఇబ్బంది పడుతున్నారు విమర్శించారు వెంటనే సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మీ రమేష్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు సురేష్ గౌడ్. సుభాష్. మాణిక్. రెడ్డి దత్తు .వెంకట్ రెడ్డి. విట్టల్ గౌడ్ .తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ రేణుక ఎల్లమ్మ టెంపుల్ లో పూజలు

**మెదక్ (ప్రజాజ్యోతి)**

శ్రావణ చివరి మంగళవారము పురస్కరించుకొని మెదక్ పట్టణంలోని







పసుపులేరు రోడ్డున గల రేణుక ఎల్లమ్మ దేవి ఆలయంలో 350 కిలోల పసుపు కొమ్ములతో పూజలు నిర్వహించడం జరిగింది. ఈ పూజకు విశేష స్పందన కలిగి మహిళా మణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు పూజలు విజయవంతంగా ముగిశాయి పూజ అనంతరము తీర్థప్రసాదాలు అన్న భోజనము కూడా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పరిచారు. గుడికి వచ్చిన మహిళా భక్తులు, పురుష భక్తులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు 350 కిలోల పసుపుకొమ్ములతో పూజలు చేయించడం మెదక్ పట్టణంలో ఇదే మొదటిసారి అని మహిళా భక్తురాళ్ళు కొని ఆడడం జరిగింది. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నప్పటికీ పూజలు నిర్వహించిన పూజారులు తమ యొక్క పూజా విధానంలో ప్రతి ఒక్కరికి సంతోషపరిచే విధంగా అన్ని ఏర్పాట్లను చేయడము భక్తిశ్రద్ధలతో పూజలో పాల్గొన్న మహిళామణులు.

# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి: మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు

**మెదక్ (ప్రజాజ్యోతి)**




గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ సూచించారు. మండపాల నిర్వహణకు సంబంధించి పోలీసు శాఖ పలు కీలక మార్గదర్శకాలను విడుదల చేసింది.

**ముఖ్యమైన వివరాలు & మార్గదర్శకాలు:**

ఉచిత ఆన్‌లైన్ నమోదు: మండపాల నిర్వాహకులు ఎటువంటి రుసుము లేకుండా కంప్యూటర్ లేదా మొబైల్ ద్వారా శిష్ట్రజూ://జూశీశ్రీఱఎవజూశీ‌తీఖశ్రీ.ంజూశీశ్రీఱఎవ.స్త్రశీజ.ఱఅ/ఱఅనవ×.ష్ట్రఎరి(ష్ట్రజూ://జూశీశ్రీఱ-ఎవజూశీ‌తీఖశ్రీ.ంజూశీశ్రీఱఎవ.స్త్రశీజ.ఱఅ/ఱఅనవ×.ష్ట్రఎ) వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసి, ఆ దరఖాస్తును సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అందించాలి. ముందస్తు సమాచారం ద్వారా భద్రతా ఏర్పాట్లు సులువవుతాయి. ట్రాఫిక్ ఆటంకాలు లేకుండా జాగ్రత్తలు: ప్రజా రవాణాకు, అత్యవసర వాహనాల (అంబులెన్స్ వంటివి) రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మండపాలను ఏర్పాటు చేయాలి. భద్రత మరియు పర్యవేక్షణ: ప్రతి గణేష్ మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు 24 గంటలూ వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. అగ్ని ప్రమాద నివారణ చర్యలు: ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, నీటి డ్రమ్ములు మరియు ఇసుకను మండపాల వద్ద సిద్ధంగా ఉంచుకోవాలి. డీజేలు, నినాదాలపై నిషేధం: ఉత్సవాల్లో మరియు శోభాయాత్రల్లో డీజేలు, టపాసులు వినియోగించకూడదు. ఇతరుల మనోభావాలను కించపరిచే నినాదాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం పూర్తిగా నిషేధం. స్పీకర్ల సమయం: రాత్రి 10 గంటల వరకు మాత్రమే మైకులు/స్పీకర్లు వినియోగించడానికి అనుమతి ఉంటుంది. ఏదైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.

## శివ్వంపేటలో మండలస్థాయి ఎస్ జి ఎఫ్ క్రీడా పోటీలకు సన్నాహక సమావేశం,,

**శివ్వంపేట ప్రజాజ్యోతి సెప్టెంబర్ 07:**



శివ్వంపేట మండలస్థాయి ఎస్ జి ఎఫ్ క్రీడా పోటీల నిర్వహణకు సంబంధించి సోమవారం మండల వనరుల కేంద్రం (వీ=జ)లో సన్నాహక సమావేశం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2 గంటలకు జరిగిన ఈ సమావేశానికి మండలంలోని అన్ని హైస్కూల్‌లు,యుపిఎస్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,పిడి లు, పి ఈ టి లు హాజరయ్యారు. ఎంఈఓ సూచనల మేరకు ఈ నెల 10,11 తేదీల్లో రెండు రోజుల పాటు జడ్పీహెచ్ఎస్ గోమారం పాఠశాల క్రీడా మైదానంలో అండర్-14,అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు ఎస్ జి ఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 10వ తేదీన అండర్-14,అండర్-17 బాలబాలికలకు వాలీబాల్,ఖో-ఖో, 11వ తేదీన అండర్-14,అండర్-17 బాలబాలికలకు కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. క్రీడా పోటీల్లో పాల్గొనే ప్రతి పాఠశాల 9వ తేదీలోగా గేమ్స్ ఫీజు చెల్లించాలని,ఫీజు చెల్లించిన పాఠశాలల విద్యార్థులకు మాత్రమే పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని ఎంఈఓ సూచించారు. పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,క్రీడా ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు.

# మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించాలి: అదనపు కలెక్టర్ నగేష్ పిలుపు

**మెదక్ (ప్రజాజ్యోతి)**

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి'భక్తి భావంతో పాటు ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి'వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీఓపీ) విగ్రహాలకు బదులుగా మట్టి, సహజ రంగులతో తయారైన పర్యావరణహిత వినాయక విగ్రహాలనే ప్రతిష్టించాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం మెదక్ జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా పరిపాలన సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మట్టి వినాయక విగ్రహాల గోడపత్రికలను (పోస్టర్లను) అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, కాలుష్య నియంత్రణ మండలి అధికారి మాధురి, హౌసింగ్ పీడీ మాణిక్యం, మెప్మా పీడీ హనుమంత్ రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.





# మల్లయ్య కుటుంబానికి సర్పంచ్ ఆర్థిక భరోసా

**అందోల్, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి):**

మక్తగూడెం గ్రామానికి చెందిన కొడూరి మల్లయ్య అకాల మరణంతో విషాదంలో ఉన్న కుటుంబానికి గ్రామ సర్పంచ్ వొగ్గు సాయికిరణ్ ఆర్థిక భరోసా కల్పించారు. కుటుంబానికి అండగా నిలిచేందుకు తన తరపున రూ.5,000 ఆర్థిక సహాయాన్ని 10వ వార్డు సభ్యుడు విష్ణు ద్వారా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం సామాజిక బాధ్యత అని సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఈశ్వర్, వొగ్గు దేవయ్య, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



# కనీస వేతన బోర్డు నుంచి సీఐటీయూను తప్పించడం దుర్మార్గం

- కార్మికుల హక్కులను హరించే కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొడతాం: ఎర్రోళ్ల మహేష్

**వట్టిపల్లి, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి):**

సంగారెడ్డి జిల్లా వట్టిపల్లి మండలశీకేంద్ర కనీస వేతన సలహా బోర్డు నుంచి సీఐటీయూను మినహాయించడాన్ని నిరసిస్తూ వట్టిపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి కామ్రేడ్ ఎర్రోళ్ల మహేష్ మాట్లాడుతూ ప్రధాన కార్మిక సంఘాలకు బోర్డులో ప్రాతినిధ్యం కల్పించకపోవడం అప్రజాస్వామికమన్నారు. పెరుగుతున్న నిత్యావసరాలు, విద్య, వైద్యం, ఇంధన ధరలకు అనుగుణంగా కార్మికులకు గౌరవప్రదమైన కనీస వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలకు రాయితీలు కల్పిస్తూ కార్మికుల హక్కులను హరించడం సరికాదన్నారు. సీఐటీయూను బోర్డు నుంచి తప్పించినా కార్మికుల హక్కుల కోసం పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షులు మహేష్, జనార్ధన్, దాసు, నరేందర్ గౌడ్, సంపత్, కుమార్, గాలయ్య, వీరారెడ్డి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



# కర్తవ్య నిర్వహణలోనే కన్నుమూసిన హెడ్ కానిస్టేబుల్ ఆనందం

## - హెడ్ కానిస్టేబుల్ మృతితో పోలీసు శాఖలో విషాదం

## మల్కాపూర్‌లో అధికారిక లాంఛనాలతో ఆనందానికి తుది వీడ్కోలు

**తూప్రాన్ (ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 08:**



విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ ఆనందం మృతి చెందిన ఘటన తూప్రాన్‌లో చోటుచేసుకుంది. మెదక్ జిల్లా ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఆనందం (54) మంగళవారం ఛాతినొప్పితో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందారు. మెదక్ ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లోని క్యూఆర్టీలో విధులు నిర్వహిస్తున్న ఆనందం, మంగళవారం తూప్రాన్ పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వర్తించేందుకు వచ్చారు. అక్కడికి చేరుకున్న అనంతరం ఛాతిలో నొప్పి రావడంతో సహచరులు వెంటనే ఆయనను తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు ఈసీజీ పరీక్ష నిర్వహిస్తున్న సమయంలో ఆనందం ఒక్కసారిగా కుప్పకూలారు. దీంతో వైద్య సిబ్బంది అత్యవసరంగా సీపీఆర్ నిర్వహించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం మేడ్చల్‌లోని మెడినోవా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆనందం మృతి చెందినట్లు నిర్ధారించారు.

### సహచరుల్లో విషాదం

హెడ్ కానిస్టేబుల్ ఆనందం మృతి వార్తతో పోలీసు సిబ్బందిలో విషాదం నెలకొంది. ఆనందం అందరితో స్నేహపూర్వకంగా, ఆత్మీయంగా మెలిగేవారని సహచరులు గుర్తుచేసుకున్నారు. విధుల విషయంలో చురుగ్గా ఉంటూ తోటి సిబ్బందితో కలిసిమెలిసి పనిచేసేవారని తెలిపారు. ఆయన ఆకస్మిక మరణాన్ని జీర్ణించుకోలేక పలువురు సహచరులు భావోద్వేగానికి గురయ్యారు.

### ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు దిగ్భ్రాంతి

ఆనందం మృతిపట్ల మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోలీసు శాఖలో ఆనందం అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు పోలీసు శాఖ అండగా ఉంటుందని పేర్కొన్నారు.

### రేపు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు

హెడ్ కానిస్టేబుల్ ఆనందం అంత్యక్రియలను బుధవారం ఉదయం 10 గంటలకు సంగారెడ్డి జిల్లా మల్కాపూర్ గ్రామంలో అధికారిక పోలీసు లాంఛనాలతో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని ఆనందానికి ఘనంగా తుది వీడ్కోలు పలకనున్నారు.

# వినాయక మండపాల ఏర్పాటుకు ముందస్తు సమాచారం తప్పనిసరి

- మండపాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు ముందస్తు సమాచారం తప్పనిసరి - ఆన్‌లైన్‌లో ఇంటిమేషన్ నమోదు చేసుకోవాలి: తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్



**తూప్రాన్ (ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 08:**

గణేష్ ఉత్సవాల నేపథ్యంలో తూప్రాన్ డివిజన్ పరిధిలోని గణేష్ ఉత్సవ కమిటీలు, నిర్వాహకులకు తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ కీలక సూచనలు చేశారు. వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపన, గణేష్ మండపాల ఏర్పాటు, ఉత్సవాల నిర్వహణ, ఊరేగింపులు, నిమజ్జనం వంటి కార్యక్రమాలకు సంబంధించి నిర్వాహకులు పోలీస్ శాఖకు ముందస్తుగా సమాచారం అందించాలని ఆయన సూచించారు. గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని డీఎస్పీ తెలిపారు. ఉత్సవాల సమయంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. న్లైన్ ఇంటిమేషన్ తప్పనిసరి, గణేష్ మండపాల ఏర్పాటుతో పాటు ఉత్సవాలకు సంబంధించిన పూర్తి వివరాలను తెలంగాణ పోలీస్ అధికారిక పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా ఇంటిమేషన్‌గా నమోదు చేసుకోవాలని డీఎస్పీ నరేందర్ గౌడ్ స్పష్టం చేశారు. మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, ఉత్సవాల వివరాలు, ఊరేగింపు, నిమజ్జనం తదితర కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని ముందుగానే పోలీస్ శాఖకు అందించడం ద్వారా బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లు సులభతరం అవుతాయని తెలిపారు. ఉత్సవ కమిటీలు చివరి నిమిషంలో కాకుండా ముందుగానే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసి పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. నిబంధనలను పాటిస్తూ ఉత్సవాలను నిర్వహించడం ద్వారా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పండుగను విజయవంతంగా నిర్వహించుకోవచ్చని పేర్కొన్నారు. భక్తి, శాంతి, క్రమశిక్షణతో గణేష్ ఉత్సవాలను నిర్వహించుకోవాలని, ప్రజలు, ఉత్సవ కమిటీలు పోలీస్ శాఖకు పూర్తిగా సహకరించాలని డీఎస్పీ కోరారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ప్రజల భద్రతకు, శాంతిభద్రతల పరిరక్షణకు తూప్రాన్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని ఆయన తెలిపారు.

# జీఓ 97 రద్దు కోసం రోడ్డెక్కిన నర్సింగ్ విద్యార్థులు

## - అందోలులో ఎన్‌హెచ్-161పై రాస్తారోకో..
## - విద్యార్థులకు మద్దతుగా రోడ్డుపై బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్
## - 'వీ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు..
## - కిలోమీటర్ మేర స్తంభించిన ట్రాఫిక్







**అందోలు, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి):**

జీఓ 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అందోలులో నర్సింగ్ కళాశాల విద్యార్థులు మంగళవారం రోడ్డెక్కారు. కళాశాల ఎదుట జాతీయ రహదారి-161పై పెద్ద సంఖ్యలో విద్యార్థులు బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. సుమారు అరగంట పాటు కొనసాగిన ఆందోళనతో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయి, సుమారు కిలోమీటర్ మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

### విద్యార్థులకు మాజీ ఎమ్మెల్యే మద్దతు

విద్యార్థులు రాస్తారోకో చేస్తున్న సమయంలో అటుగా వెళ్తున్న అందోలు మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ అక్కడ ఆగి వారి ఆందోళనకు మద్దతు ప్రకటించారు. విద్యార్థులతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసనలో పాల్గొన్నారు. 'వీ వాంట్ జస్టిస్.. జీఓ 97 వెంటనే రద్దు చేయాలి' అంటూ విద్యార్థులు నినాదాలు చేయగా, క్రాంతి కిరణ్ సైతం వారితో గొంతు కలిపారు. దీంతో కొద్దిసేపు జాతీయ రహదారిపై ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

### జీఓ 97 రద్దు చేయాలి

ఈ సందర్భంగా క్రాంతి కిరణ్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేలా ఉన్న జీఓ 97ను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నర్సింగ్ విద్యార్థుల సమస్యను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించి, వారి విద్యా భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరారు. ఈ ప్రాంతానికి చెందిన విద్యావంతుడైన మంత్రి దామోదర రాజనర్సింహ విద్యార్థుల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, జీఓ రద్దు కోసం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన నిలబడి ప్రభుత్వానికి వారి సమస్యను తెలియజేస్తామని తెలిపారు.

### ర్యాలీకి అనుమతి ఇవ్వాలని డిమాండ్

జాతీయ రహదారిపై విద్యార్థులు బైఠాయించడంతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. దీంతో రాస్తారోకోను విరమించాలని పలువురు ప్రయాణికులు విద్యార్థులను కోరారు. అయితే తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ర్యాలీ నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని, అప్పటివరకు ఆందోళన కొనసాగిస్తామని విద్యార్థులు స్పష్టం చేశారు.ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ స్పందిస్తూ.. ర్యాలీ నిర్వహణకు అవసరమైన అనుమతులు తీసుకునేందుకు సహకరిస్తామని, అనుమతి లభించిన అనంతరం విద్యార్థులకు మద్దతుగా తాము కూడా ర్యాలీలో పాల్గొంటామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు రాస్తారోకోను విరమించారు.జీఓ 97 రద్దు కోసం నర్సింగ్ విద్యార్థులు జాతీయ రహదారిపై చేపట్టిన ఆందోళనకు మాజీ ఎమ్మెల్యే మద్దతు ఇవ్వడం, ర్యాలీకి అనుమతి కోసం డిమాండ్ చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

---

# పరిశ్రమల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

## -సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి..
## -వలస కార్మికుల వివరాల పూర్తిగా నమోదు చేయాలి
## -శేరి లింగంపల్లి జోన్ డిసిపి శ్రీనివాస్





**జిన్నారం(ప్రజాజ్యోతి)**

పారిశ్రామిక ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ నేరాల నియంత్రణకు పరిశ్రమల యాజమాన్యాలు పోలీసులకు సహకరించాలని శేరిలింగంపల్లి జోన్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ సూచించారు. మంగళవారం బొల్లారం ఇండస్ట్రియల్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పరిశ్రమల్లో భద్రతా చర్యలు, సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి నిరంతర పర్యవేక్షణ తదితర అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. పరిశ్రమల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా పరిశ్రమలో పనిచేస్తున్న వలస కార్మికుల వ్యక్తిగత వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేసుకోవడంతోపాటు, వారి పూర్వ చరిత్ర (యాంటిసిడెంట్స్)ను తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని స్పష్టం చేశారు. ఉద్యోగంలో చేరే సమయంలోనే కార్మికుల వివరాలు, గుర్తింపు పత్రాలు పరిశీలించి రికార్డుల్లో నమోదు చేసుకోవాలని సూచించారు.పరిశ్రమల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని, వాటి ద్వారా పరిసరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డీసీపీ పేర్కొన్నారు. సీసీ కెమెరాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా అవసరమైన చోట అదనపు కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పరిశ్రమల భద్రతకు సంబంధించి ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.సమావేశంలో ఐడీఏ బొల్లారం సీఐ వి. సుధీర్‌కుమార్, బొల్లారం ఇండస్ట్రియల్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌రావు, కార్యదర్శి రాయుడు,రాజు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బాలికల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత

## - బేటీ బచావోబేటీ పడావోలో భాగంగా పలు కార్యక్రమాలు

## - నారాయణఖేడ్ న్యూ బస్టాండ్‌లో తల్లిపాల గది ప్రారంభం














**నారాయణఖేడ్, సెప్టెంబర్ 8, ప్రజాజ్యోతి:**

బేటీ బచావోబేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మహిళలు, బాలికల సంక్షేమం, భద్రత, ఆరోగ్యం, సాధికారతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా సంక్షేమ అధికారిణి శ్రీమతి కె. లలితా కుమారి తెలిపారు. మహిళా శిశు దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో నారాయణఖేడ్ పట్టణంలో మంగళవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు.

**ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారిణి కె. లలితా కుమారి మాట్లాడుతూ..**

నారాయణఖేడ్ న్యూ బస్టాండ్‌లో ప్రయాణించే తల్లులు తమ చిన్నారులకు తల్లిపాలు పట్టించేందుకు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తల్లిపాల గదిని ప్రారంభించారు. తల్లులు తమ చిన్నారులకు ప్రశాంతమైన, గోప్యతతో కూడిన అనుకూల వాతావరణంలో తల్లిపాలు అందించేందుకు ఈ గది ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. శిశువులకు తల్లిపాలు అత్యంత శ్రేష్ఠమైన పోషకాహారమని, వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో కీలకమని ఆమె పేర్కొన్నారు. ప్రయాణ సమయంలో తల్లులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే ఈ గది ఏర్పాటు ఉద్దేశమని తెలిపారు.అనంతరం నారాయణఖేడ్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బాలికలకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలికలకు రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. బేటీ బచావోబేటీ పడావో కార్యక్రమం బాలికల విద్యతో పాటు వారి ఆరోగ్యం, భద్రత, గౌరవం, సాధికారతకు కూడా ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. బాలికలు ఆరోగ్యంగా ఉంటేనే విద్యలో రాణించి భవిష్యత్తులో సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించగలరని అన్నారు.రుతుక్రమ సమయంలో పరిశుభ్రత పాటించడం, శానిటరీ ప్యాడ్స్‌ను సురక్షితంగా వినియోగించడం, ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయకపోవడం వంటి అంశాలపై బాలికలకు అవగాహన కల్పించామని తెలిపారు. బాలికలు సమతుల్యమైన పోషకాహారం తీసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.కేజీబీవీ పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, అధికారులు, సిబ్బంది కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా సూచించారు.అనంతరం అధికారులు హనుమంతరావుపేట్ అంగన్వాడీ కేంద్రం1, కేంద్రం2లను ఆకస్మికంగా సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు.ఈ కార్యక్రమాల్లో నారాయణఖేడ్ డీఎస్పీ వెంకటరెడ్డి, నారాయణఖేడ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఎన్. సుజాత, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, సఖి సమన్వయకర్త కల్పన, నారాయణఖేడ్ ఎంపీడీఓ రత్నవేణి, నారాయణఖేడ్ డిపో మేనేజర్ శ్రీ సాయి సుబ్రహ్మణ్యం, వైద్యాధికారి డాక్టర్ తరణి, షీ టీం ఏఎస్ఐ తులసీరామ్, కేజీబీవీ ప్రిన్సిపల్ సురేఖ, పాఠశాల సిబ్బంది, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది, ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గిజిగాని తెలివికి సెల్యూట్.





**మునిపల్లి సెప్టెంబర్ 8( ప్రజాజ్యోతి):**

పేరుకుమాత్రం పిట్ట(పిచ్చుక) ఆలోచనల్లో మాత్రం చాలా తెలివైందని చెప్పవచ్చు. పనిచేయటానికి మనుసుల్లాగా రెండు చేతులు లేకున్నా,కాళ్లసహాయంతో అవసరమైన చోట నడుస్తూ,రెక్కల సహాయంతో పైకి ఎగురుతూ ఎక్కడికైనా వెళుతుంది పిట్ట. పొద్దంతా పల్లె ప్రాంతాల్లో రైతులు పండించిన పంట పొలాల్లో ,పచ్చని ప్రకృతిలో వాటికి కావలసిన ఆహారము కోసం పిట్టలు కాకులు పరుగెత్తుతాయి. కానీ రాత్రి పడుతుంటే మాత్రం ఏదో ఒకచోట నిద్రించడానికి ఆలోచిస్తూ వాటికి నచ్చిన చోటుకు వెళ్ళి పోతాయి. ఈ సందర్భం లోనే చలి ,గాలి,వాన, వేడి,నుంచి,ఇతర జంతువులనుంచి తప్పించుకోవటానికి, ప్రశాంతంగా నిద్రించడానికి తనకంటూ ఓ గూడు కావాలని కోరుకుంటాయి. కానీ ఆ గూడును మాత్రం వాటికి ఎవరు కట్టిస్తారు. అందుకేనేమో ఎవరి మీద ఆధారపడకుంటా,తమ శ్రమ తెలివి తేటలు ప్రకృతిని నమ్ముకొని ఓ చెట్టుకు గూడు కట్టుకోవాలని నిర్ణయానికివస్తాయేమో కాబోలు. ప్రకృతిలో దొరికే గడ్డి,గరక,తదితర రకాల పూసలను తన ముక్కు,కాళ్ళ సహాయంతో ఏరుకొచ్చి అద్భుతమైన,రక్షణ కవచంగా ఓ గూడును నిర్మించుకొంటాయి.అందులోనే గుడ్లను పెట్టటం పొదగటం,పిల్లలు తీయటం వాటికి రెక్కలొచేంతవరకు కాపాడుకుంటాయి. ఇలా పిట్టలు తమ ఉనికిని కోల్పోకుండా ఎవరిపైనా ఆధారపడకుండా జీవనం గడుపుతుంటాయి. ఈ విధానము అన్ని అవయవాలున్నా మనిషి కూడా గూడుకోసం ఇతరులపై ఆధారపడి జీవిస్తున్న మనిషికి ఆదర్శంగా చెప్పుకోవచ్చు. అయితే పిట్ట గూడు నిర్మాణాన్ని చూసిన మనిషి ఆదిమ కాలము నుండి ప్రారంభమైన గుడిసె విధానము పిట్టలు అల్లిన గూడును చూసి నేర్చుకున్నారని చరిత్రలు చెపుతున్నాయి. ఏది ఏమైనా ప్రకృతిలో అన్నిరకాల జ్ఞానాన్ని మనిషి జంతువులు పక్షులు పిట్టలు ,ప్రకృతిని చూసి అంచెలంచెలుగా నేర్చుకొని అభివృద్ధి అవుతున్నది తప్పా మనిషి నుంచి ప్రకృతి ,పక్షులు నేర్చుకున్న దేమీ లేదని చెప్పవచ్చు.అనటానికి ఈ గూడు నిదర్శనం.ఈ దృశ్యం ప్రజా జ్యోతి కెమేరాకు చిక్కింది.

# ప్రతి చుక్కా.. ఒక ఆశ


-గీతంలో రక్తదాన శిబిరం 170 యూనిట్ల రక్తం సేకరణ..

- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

పటాన్ చెరు(ప్రజాజ్యోతి)

ఆపదలో ఉన్నవారికి రక్తం అందించి ప్రాణాలు కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పిలుపునిచ్చింది. 'ఒక చుక్క.. ఒక ఆశ.. ఒక జీవితం' అనే నినాదంతో ఎన్టీఆర్ ట్రస్టు బ్లడ్ బ్యాంక్ సహకారంతో మంగళవారం గీతం హైదరాబాద్ క్యాంపస్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. స్వచ్ఛంద రక్తదానంపై అవగాహన కల్పించడంతోపాటు, సామాజిక బాధ్యతగా రక్తదానం చేసేందుకు విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందిని ప్రోత్సహించడం కార్యక్రమ ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా ముందుకొచ్చి సుమారు 170 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. అధ్యాపకులు, సిబ్బంది కూడా శిబిరంలో పాల్గొని సేవా స్ఫూర్తిని చాటారు. రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు విలువైన సహాయం అందించవచ్చని నిర్వాహకులు తెలిపారు. రక్తదాతలకు పండ్లు, శీతల పానీయాలు అందించడంతోపాటు వారి సేవలను అభినందిస్తూ ప్రశంసాపత్రాలు అందజేశారు. రక్తదాతలను అభినందిస్తూ.. స్వచ్ఛంద రక్తదానం ద్వారా సమాజానికి మరింత సేవ చేయాలని పిలుపునిచ్చింది. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ద్వారా గీతం క్యాంపస్‌లో సామాజిక బాధ్యత, సేవా స్ఫూర్తి బలంగా ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు.





# ప్రశాంత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలి

- శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా వేడుకలు నిర్వహించాలి.

- విద్యుత్, అగ్ని ప్రమాదాల నివారణపై అప్రమత్తంగా ఉండాలి

-జిన్నారం సిఐ రమణారెడ్డి






గుమ్మడిదల(ప్రజాజ్యోతి)

వినాయక చవితి, గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు పూర్తి బాధ్యత వహించాలని పోలీసులు సూచించారు. గుమ్మడిదల మండల పరిధిలో రాబోయే గణేష్ ఉత్సవాల నేపథ్యంలో గణేష్ ఉత్సవ కమిటీలు, యువజన సంఘాల ప్రతినిధులతో గుమ్మడిదల పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, భద్రతా చర్యలపై అధికారులు అవగాహన కల్పించారు. విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు ప్రతి దశలో నిబంధనలు పాటించాలని సూచించారు. మండపాల వద్ద విద్యుత్ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, విద్యుత్ తీగలు, కనెక్షన్ లు విషయంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. అగ్ని ప్రమాదాలకు అవకాశం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గణేష్ విగ్రహాల ఊరేగింపు సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మార్గాలను ముందుగానే పరిశీలించుకోవాలని తెలిపారు. సౌండ్ సిస్టమ్, డీజే వినియోగానికి సంబంధించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించరాదని సూచించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఉత్సవాలను మతసామరస్యం, సోదరభావంతో శాంతియుతంగా నిర్వహించాలని, పోలీస్, విద్యుత్, మున్సిపల్ తదితర శాఖలకు నిర్వాహకులు సహకరించాలని అధికారులు తెలిపారు. సమావేశంలో జిన్నారం సీఐ రమణారెడ్డి, గుమ్మడిదల ఎస్ఐ అరుణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ దశరథ్, ఎలక్ట్రికల్ ఏఈ, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, యువజన సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి




రాయికోడ్ సెప్టెంబర్ 08 (ప్రజా జ్యోతి):

గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని ఎస్సై చైతన్య కిరణ్, జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు సూచించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా రాయికోడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేయనున్న గణేష్ మండపాల నిర్వాహకులతో మంగళవారం పోలీసుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. మండపాల ఏర్పాటు, శోభాయాత్రలు, నిమజ్జన కార్యక్రమాలకు సంబంధిత అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. లౌడ్‌స్పీకర్లు, సౌండ్ సిస్టమ్‌లను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మాత్రమే వినియోగించాలన్నారు. మత, కుల, రాజకీయ భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రసంగాలు, పాటలు, కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. మండపాల వద్ద అగ్నిమాపక, విద్యుత్ భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నిర్వాహకులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మద్యం సేవించి కార్యక్రమాల్లో పాల్గొనడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం పూర్తిగా నిషేధమన్నారు. నిమజ్జన శోభాయాత్రలో పోలీసుల సూచించిన మార్గాలను మాత్రమే అనుసరించాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గణేష్ మండపాల నిర్వాహకులు తమ మండపాల వివరాలను తెలంగాణ పోలీస్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం అందుబాటులో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొని పోలీసు శాఖ సూచించిన నిబంధనలు, భద్రతా చర్యలను పాటిస్తామని హామీ ఇచ్చారు.

ప్రజాజ్యోతి
బుధవారం 09 సెప్టెంబర్ 2026

# పటాన్‌చెరులో రాజకీయ రణరంగం

## - అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్‌బీఆర్ఎస్ శ్రేణుల బాహాబాహీ.

## ఒకేసారి పోటాపోటీ ర్యాలీలు.. -తోపులాటలు, కర్రలతో పరస్పర దాడులు.

## -పోలీసుల అనుమతులపై స్థానికుల ఆగ్రహం..

## - ఉద్రిక్తతతో హైవేపై నిలిచిన వాహనాలు

**పటాన్‌చెరు(ప్రజాజ్యోతి)**

అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పోటాపోటీగా రోడ్డెక్కడంతో పటాన్‌చెరు అంబేద్కర్ చౌరస్తా ఒక్కసారిగా రాజకీయ రణరంగంగా మారింది. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కీలక కూడలిలో రెండు పార్టీల కార్యకర్తలు ఒకేసారి భారీగా చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. నినాదాలతో ప్రారంభమైన నిరసనలు క్రమంగా తోపులాటలకు దారితీశాయి. పరిస్థితి అదుపు తప్పడంతో ఇరువర్గాల మధ్య కర్రలతో పరస్పరం దాడులు చేసుకునే స్థాయికి చేరింది దీంతో కొద్దిసేపు











చౌరస్తా పరిసరాల్లో తీవ్ర గందరగోళం నెలకొంది.ఎమ్మెల్సీ తాతా మధు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధారాణి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి అంబేద్కర్ చౌరస్తా వైపు చేరుకున్నారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధ పదవులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.మరోవైపు మహిళా ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి, సబితారెడ్డిలపై పోలీసులు దాడి చేశారంటూ బీఆర్ఎస్ శ్రేణులు నిరసన చేపట్టాయి. ఈ ఘటనకు నిరసనగా మైత్రి మైదానం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివచ్చారు. ఇరువర్గాల ర్యాలీలు దాదాపు ఒకే సమయంలో అంబేద్కర్ చౌరస్తా వద్దకు చేరుకోవడంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది.

### నినాదాల నుంచి తోపులాట వరకు..

రెండు పార్టీల కార్యకర్తలు ఎదురెదురుగా నిలబడి పెద్దఎత్తున నినాదాలు చేయడంతో ఉద్రిక్తత పెరిగింది. ఒకరినొకరు అడ్డుకునే క్రమంలో తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితి అదుపు తప్పడంతో ఇరువర్గాల మధ్య కర్రలతో దాడులు చేసుకున్నారు, దీంతో అక్కడున్న పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. జాతీయ రహదారికి సమీపంలోనే ఘటన చోటుచేసుకోవడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.ఒకే సమయంలో రెండు రాజకీయ పార్టీలకు ర్యాలీలకు అనుమతులు ఎలా ఇచ్చారనే ప్రశ్నలు స్థానికుల నుంచి వ్యక్తమయ్యాయి. ముందస్తుగా ఇరువర్గాల ర్యాలీల సమయం, మార్గాలను సమన్వయం చేసి ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీల నిరసనలు ప్రజాస్వామ్య హక్కులేనని, అయితే వాటి కారణంగా సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొన్నారు.

### హైవేపై ఉద్రిక్తత

పటాన్‌చెరు అంబేద్కర్ చౌరస్తా నగరానికి, పారిశ్రామిక ప్రాంతాలకు కీలకమైన రహదారి కూడలి కావడంతో అక్కడ ఏ చిన్న ఘటన జరిగినా ట్రాఫిక్‌పై ప్రభావం పడుతుంది. రెండు పార్టీల శ్రేణులు భారీగా చేరుకోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో వాహనదారులు సుమారు మూడు గంటలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాజకీయ నిరసనల పేరుతో ప్రధాన రహదారులను దిగ్బంధించే పరిస్థితి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### పోలీసుల తీరుపై చర్చ

ఈ ఘటనతో పటాన్‌చెరు రాజకీయ వర్గాల్లో ఒక్కసారిగా వేడి రాజుకుంది. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఇప్పటికే కొనసాగుతున్న రాజకీయ విభేదాలు తాజా ఘటనతో మరింత ముదిరే పరిస్థితి కనిపిస్తోంది. ఒకే ప్రాంతంలో, ఒకే సమయంలో రెండు పార్టీల కార్యక్రమాలు నిర్వహించేందుకు అనుమతులు ఇచ్చిన అంశంపై పోలీసుల నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా రాజకీయ పార్టీల కార్యక్రమాలకు అనుమతులు ఇచ్చే సమయంలో మార్గాలు, సమయాలు, భద్రతా ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.పటాన్‌చెరు వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణ అత్యంత కీలకమని, రాజకీయ విభేదాలు ఘర్షణలకు దారితీయకుండా పోలీసులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఘటన నేపథ్యంలో పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకురావడంతో అనంతరం ఇరువర్గాలు అక్కడి నుంచి వెళ్లిపోయాయి. అయితే అంబేద్కర్ చౌరస్తాలో చోటుచేసుకున్న ఈ ఘర్షణ పటాన్‌చెరులో రాజకీయ వేడిని మరోసారి బయటపెట్టింది.

# సదాశివపేటలో విషాదం స్కూల్ బస్సు కిందపడి ఆరేళ్ల బాలుడు మృతి





**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**



సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. స్కూల్ బస్సు రూపంలో వచ్చిన ప్రమాదం ఒక చిన్నారి ప్రాణాన్ని బలితీసుకుంది. బస్సు చక్రాల కింద పడి ఆరేళ్ల బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు.సిద్ధాపూర్ గ్రామానికి చెందిన టైటస్ అనే విద్యార్థి స్థానిక జీనియస్ స్కూల్‌లో చదువుకుంటున్నాడు. రోజూలాగే పాఠశాల ముగిసిన తర్వాత టైటస్ స్కూల్ బస్సులో ఇంటికి చేరుకున్నాడు. తన అన్నను ఇంటికి తీసుకెళ్లేందుకు అతని తమ్ముడు ఎఫ్రాయిమ్ బస్సు వద్దకు వచ్చాడు.అయితే, అన్నను దింపిన తర్వాత స్కూల్ బస్సు డ్రైవర్ వెనుక ఉన్న చిన్నారిని గమనించకుండా వాహనాన్ని ముందుకు కదిలించాడు. దీంతో బస్సు వెనుక చక్రాలు చిన్నారి ఎఫ్రాయిమ్ పైనుంచి వెళ్లాయి. తీవ్ర గాయాలపాలైన ఎఫ్రాయిమ్, ప్రమాద స్థలంలోనే విగతజీవిగా పడిపోయాడు.కళ్లముందే ఆడుతు పాడుతు తిరిగే చిన్నారి క్షణాల్లో ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. సిద్ధాపూర్ గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. డ్రైవర్ అశ్రద్ధే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు, కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

---

# నిమజ్జనానికి పకడ్బందీ ప్రణాళిక

## - శాంతియుత నిర్వహణకు పోలీసుమున్సిపల్ యంత్రాంగం సమన్వయంమండపాలకు అనుమతులు తప్పనిసరి

## - నిమజ్జనంపై పోలీసుల ప్రత్యేక దృష్టి

**అందోల్, సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి):**



వినాయక చవితి ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో జోగిపేటలో పోలీసు, మున్సిపల్ యంత్రాంగం ముందస్తు కసరత్తుకు శ్రీకారం చుట్టింది. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు, నిమజ్జనోత్సవాన్ని సజావుగా పూర్తి చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించనున్నారు. మండపాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు నిర్వాహకులు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు.మంగళవారం జోగిపేట పట్టణంలోని శ్రీరామ గార్డెన్‌లో నిర్వహించిన పీసీ కమిటీ సమావేశంలో గణేష్ ఉత్సవాల నిర్వహణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జోగిపేట సీఐ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. గణేష్ మండపాల ఏర్పాటు కోసం సంబంధిత శాఖల నుంచి ముందస్తుగా అనుమతులు తీసుకోవడం తప్పనిసరని తెలిపారు.మండపాల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాలని, ఊరేగింపులు, నిమజ్జన సమయంలో పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలు, అధిక శబ్దంతో కార్యక్రమాలు నిర్వహించకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు శాఖ అన్ని చర్యలు చేపడుతుందని తెలిపారు.

### రెండు రోజుల్లో నిమజ్జనం పూర్తి చేయాలి

గణేష్ నవరాత్రులు పూర్తయిన తర్వాత నిమజ్జనోత్సవాన్ని మున్సిపల్ పరిధిలో రెండు రోజుల్లో పూర్తి చేసేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, లైటింగ్, రహదారి తదితర సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున నిమజ్జన సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీసు బందోబస్తును పటిష్ఠం చేయడంతో పాటు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని అన్నారు.గణేష్ ఉత్సవ కమిటీలు, ప్రజలు పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు సహకరించాలని నాయకులు కోరారు. సమావేశంలో అందోల్ తహసిల్దార్ మధుకర్‌రెడ్డి, ఎస్ఐ గిరి శ్రీకాంత్, పార్టీ సీనియర్ నాయకులు పట్లోళ్ల ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్ గడ్డి అరుణ్‌కుమార్, రామకృష్ణ, మాజీ కౌన్సిలర్ కోరబోయిన నాగరాజ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

---

# మునిపల్లి నుండి అల్లాపూర్, బోడపల్లి,తక్కడ పల్లి వరకు డబల్ రోడ్డు విస్తరణ పనులు.

**మునిపల్లి సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి):**

మండల కేంద్రం మైన మునిపల్లి చౌరస్తా నుండి అల్లాపూర్,బోడపల్లి,తక్కపల్లి గ్రామాలవరకు డబల్ రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవతో మండలములో రోడ్ల మరమ్మతులు,వంతెనలు,సింగల్ రోడ్లను డబల్ రోడ్లుగా మారుస్తూ ప్రజలకు ప్రయాణము చేయడం సులువుగా ఉండాలనీ కోరుకుంటూ పనులను ముమ్మరం చేస్తున్నట్లు కాంగ్రెస్ నాయకత్వం చెబుతుంది. ఈ నేపథ్యంలో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రారంభించిన పనులను త్వరగా నాణ్యతగా చేపట్టాలని అధికారులను,కాంట్రాక్టర్లను,ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు.







# ఉత్సవాల వేళ అప్రమత్తతే రక్షణ

## - విద్యుత్ కనెక్షన్లు, మండపాల వద్ద భద్రతపై ప్రత్యేక దృష్టి

## - అగ్ని ప్రమాదాలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి




**వట్టిపల్లి, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి):**

వినాయక చవితి, గణేష్ నవరాత్రి ఉత్సవాల సందడి ప్రారంభం కానున్న నేపథ్యంలో భద్రతా చర్యలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. భక్తి ఉత్సాహంలో చిన్నపాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమాదానికి దారితీయకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గణేష్ మండపాల వద్ద విద్యుత్ కనెక్షన్లు, వైరింగ్, అలంకరణలు, అగ్ని ప్రమాదాల నివారణపై అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.వట్టిపల్లి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ కమిటీలు, యువజన సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఉత్సవాల భద్రతకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు ప్రతి దశలో నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

### విద్యుత్ విషయంలో నిర్లక్ష్యం వద్దు

గణేష్ మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. మండపాల అలంకరణ కోసం ఏర్పాటు చేసే విద్యుత్ తీగలు, కనెక్షన్ల విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని తెలిపారు. షార్ట్‌సర్క్యూట్ వంటి ఘటనలకు అవకాశం లేకుండా విద్యుత్ వ్యవస్థను ముందుగానే పరిశీలించుకోవాలని సూచించారు. అదేవిధంగా మండపాల వద్ద అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఉత్సవాల్లో పాల్గొనే భక్తుల భద్రతకు నిర్వాహకులు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

### ఊరేగింపులో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

గణేష్ విగ్రహాల ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని పోలీసులు సూచించారు. ఊరేగింపు మార్గాలను ముందుగానే పరిశీలించి, అవసరమైన చోట్ల ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టాలని తెలిపారు.సౌండ్ సిస్టమ్, డీజేల వినియోగంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా అధిక శబ్దం చేయరాదని స్పష్టం చేశారు. పండుగను మతసామరస్యం, సోదరభావంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ లక్ష్మీకాంత్‌రెడ్డి కోరారు. ఉత్సవ కమిటీలు పోలీసులతో పాటు విద్యుత్, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నల్లవాగు నీటి కోసం పోరాటం.. భూపాల్ రెడ్డి హౌస్ అరెస్ట్



## - ఎస్ఐ రవి గౌడ్ ఆధ్వర్యంలో

## ముందస్తు గృహనిర్బంధం

**కల్హేర్, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి):**

నల్లవాగు ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని కలెక్టర్‌ను కలిసేందుకు సంగారెడ్డికి బయలుదేరిన మాజీ ఎమ్మెల్యే యం. భూపాల్ రెడ్డిని పోలీసులు మంగళవారం ఖానాపూర్‌లో హౌస్ అరెస్ట్ చేశారు. కల్హేర్ ఎస్ఐ రవి గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు ఆయనను గృహనిర్బంధం చేశారు.ఈ సందర్భంగా భూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. రైతుల పంటలు కాపాడే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. నల్లవాగు ప్రాజెక్టులో పేరుకుపోయిన పూడికను తొలగించి, తక్షణమే సాగునీరు విడుదల చేసి పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఎండుతున్న పంటలు.. కదిలిన రైతులు

## - నల్లవాగు నీటి కోసం పోరుబాట

## - అదనపు కలెక్టర్ సంగీతకు రైతుల వినతిపత్రం .

## - పోలీసుల ఆంక్షలను అధిగమించి కలెక్టరేట్‌కు తరలింపు





**కల్హేర్, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి):**

నల్లవాగు ప్రాజెక్టు నుంచి వెంటనే సాగునీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ కల్హేర్ మండలంలోని నల్లవాగు ఆయకట్టు రైతులు మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. రైతుల తరఫున జిల్లా అదనపు కలెక్టర్ సంగీతకు వినతిపత్రం సమర్పించారు.మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతులు తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కలెక్టరేట్‌కు బయలుదేరగా పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ రైతులు వెనక్కి తగ్గకుండా ముందుకు సాగి అదనపు కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. నల్లవాగు నీటిపై ఆధారపడి వేలాది ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నామని తెలిపారు. పంటలకు కీలకమైన సమయంలో సాగునీరు అందకపోవడంతో వరి తదితర పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు కళ్లముందే ఎండిపోతుంటే రైతులు ఎవరిని ఆశ్రయించాలని ప్రశ్నించారు. నల్లవాగు ప్రాజెక్టు నుంచి తక్షణమే నీటిని విడుదల చేసి ఆయకట్టు పరిధిలోని పంట పొలాలకు సాగునీరు అందించాలని కోరారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం.. తమ గోడును అధికారులకు చెప్పుకునేందుకు వెళ్తున్న రైతులను పోలీసులు అడ్డుకోవడం దురదృష్టకరమని నాయకులు విమర్శించారు. రైతుల గొంతును అణచివేయడం కాకుండా, వారి పంటలను కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నల్లవాగు నీటిని విడుదల చేసి పంటలను కాపాడే వరకు రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నరసింహారెడ్డి, సర్పంచ్ సంగన్న, పండరి, ప్రకాష్, విట్టల్, రాములు తదితరులు పాల్గొన్నారు.

---


# ముక్కు, చెవి, గొంతు సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

## - ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదిస్తే మెరుగైన ఫలితాలు

## - డాక్టర్ పి. సురేష్ కుమార్, ఈఎన్‌టీ, ముక్కుతల శస్త్రచికిత్స నిపుణులు








**నారాయణఖేడ్, సెప్టెంబర్ 8, ప్రజాజ్యోతి:**

ముక్కు, చెవి, గొంతుకు సంబంధించిన సమస్యలను చిన్నవిగా భావించి నిర్లక్ష్యం చేయడం వల్ల భవిష్యత్తులో తీవ్రమైన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ఈఎన్‌టీ, ముక్కుతల శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ పి. సురేష్ కుమార్ సూచించారు. ఆయన ప్రజాజ్యోతితో మాట్లాడుతూ..ముఖ్యంగా తరచూ వచ్చే జలుబు, ముక్కు దిబ్బడ, సైనసైటిస్, చెవిలో నొప్పి, వినికిడి లోపం, గొంతు నొప్పి, స్వరం మారడం వంటి లక్షణాలు కొనసాగితే స్వయంగా మందులు వాడకుండా నిపుణుల సలహా తీసుకోవాలని తెలిపారు.ముక్కు ద్వారా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తరచూ తలనొప్పి, ముక్కు నుంచి రక్తస్రావం, చెవుల్లో శబ్దాలు వినిపించడం, వినికిడి తగ్గడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. పిల్లల్లో చెవి ఇన్ఫెక్షన్లు, వినికిడి సమస్యలు వారి మాటలు నేర్చుకోవడం, చదువుపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.గొంతు సమస్యలు కూడా సాధారణంగా తీసుకోకూడదని పేర్కొన్నారు. గొంతు నొప్పి లేదా బొంగురుపోవడం దీర్ఘకాలం కొనసాగడం, మింగడంలో ఇబ్బంది, మెడ ప్రాంతంలో వాపు వంటి లక్షణాలు కనిపిస్తే వైద్య పరీక్షలు చేయించుకోవడం అవసరమన్నారు.ప్రస్తుత కాలంలో కాలుష్యం, దుమ్ము, పొగ, అలర్జీలు, జీవనశైలిలో మార్పుల కారణంగా ముక్కుచెవిగొంతు సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. పరిశుభ్రత పాటించడం, పొగతాగడం వంటి అలవాట్లకు దూరంగా ఉండటం, అవసరమైనప్పుడు వైద్యుల సూచన మేరకు చికిత్స తీసుకోవడం ద్వారా అనేక సమస్యలను నియంత్రించవచ్చన్నారు.“లక్షణాలను దాచిపెట్టడం కంటే, సమస్యను ముందుగానే గుర్తించి సరైన వైద్యం పొందడం ఎంతో మేలు. ఆరోగ్యంపై అనుమానం వచ్చినప్పుడు అర్హత కలిగిన ఈఎన్‌టీ నిపుణులను సంప్రదించాలి” అని సూచించారు.